సాక్షి
సిద్దిపేట
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



చెరగని జ్ఞాపకాలు..

నాటి దోపిడీ, వెట్టి, పెత్తందారి వ్యవస్థ, అరాచకాలపై పోరాడిన వీరులు.. అనాటి ఘటనలు..

వివరాలు 8లో ▶



చరిత్రను వక్రీకరిస్తే..

జీజేపీ నాయకులు నాటి చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఎం నేత జాన్ వెస్లీ మండిపడ్డారు.

వివరాలు 8లో ▶

నేడు ప్రజాపాలన వేడుకలు

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్‌లో సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని ప్రజాపాలన వేడుకలు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథి జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించనున్నారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను అభినందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజురెడ్డి, ఆర్థికప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



దుబ్బాకలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న గరీమా అగర్వాల్

దుబ్బాక: దసరా నాటికి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు చేసేలా త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని 15వ, 6వ వార్డుల్లో, చేర్వాపూర్‌లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, మేస్త్రీలతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. దుబ్బాక పట్టణం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉందన్నారు. ముగ్గులు పోసిన చోట వారం రోజుల్లో బేస్మెంట్ లెవల్ పూర్తికావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనంతుల శ్రీనివాస్, చంద్రారెడ్డి, వార్డు ఆఫీసర్స్ తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలకు నోటీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి(ఏఓ) తస్లీమా సుల్తానా మంగళవారం స్థానిక రైతు వేదికలో విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. పోతారం(జే) గ్రామంలోని లక్ష్మీ ఫర్టిలైజర్ దుకాణం, మల్లంపల్లిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం(ప్రహర్ష), కట్కూర్‌లోని సహకార సంఘానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. యూరియా బస్తాలు తీసుకెళ్లేందుకు టోకెన్లు ఇవ్వగా, రైతులు ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లేలోపే యూరియా బస్తాలను ఇతరులకు అమ్మినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పోతారం(జే)లోని ఎరువుల దుకాణం యజమాని బ్లాక్‌లో బస్తా యూరియాను రూ.500లకు అమ్మినట్లు తెలిసిందన్నారు. దీంతో సదరు దుకాణదారుడికి నోటీస్ జారీ చేశామన్నారు. యూరియా బ్లాక్‌లో అమ్మినట్లు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

త్వరలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు హెల్త్ కార్డులు

ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి



గఫార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీలు శ్రీపాల్‌రెడ్డి, డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: త్వరలోనే ఉపాధ్యాయ, ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని, షరతుల్లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం లభించనున్నదని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గఫార్ ఉద్యోగ విరమణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. మెరుగైన పీఆర్‌సీ ఇప్పించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ వృత్తిలో అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగం, రాష్ట్ర నాయకులు వంగ మోహన్‌రెడ్డి, గుండు లక్ష్మన్, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నంగునూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

బొడ్డెమ్మ.. సంబురం

నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు పుట్టమన్ను తెచ్చి బొడ్డెమ్మలను తయారు చేసి గ్రామ కూడళ్లలో మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. అయిదు రోజుల అనంతరం బొడ్డెమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. మరుసటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో తొమ్మిది రోజుల వేడుకలు ప్రారంభమవుతాయి. - నంగునూరు(సిద్దిపేట)

బ్యాంకర్ల తిరకాసు

ఎఫ్‌డీ చేస్తేనే డాక్యుమెంటేషన్ అంటూ మెలిక

- అయోమయంలో 'డెయిరీ' లబ్ధిదారులు
- ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 8.40కోట్ల సబ్సిడీ విడుదల
- ఇప్పటివరకు గ్రౌండింగ్ అయింది 281 యూనిట్లే
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పాడి పశువులు

సాక్షి, సిద్దిపేట: బ్యాంకర్లు తిరకాసు పెడుతుండటంతో 'డెయిరీ' లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రుణాలు ఇవ్వాల్సింది పోయి.. సబ్సిడీ మినహా రుణాన్ని ముందుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేస్తేనే డాక్యుమెంటేషన్ అంటూ మెలిక పెడుతున్నారు. దీంతో యూనిట్ మంజూరైనప్పటికీ ఎఫ్‌డీ చేయకపోవడంతో గ్రౌండింగ్ కావడం లేదు. ఎస్సీ కార్పొరేషన్‌లో 2020–21కు సంబంధించి 600 యూనిట్లకు రూ.8.40కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 281 యూనిట్లు గ్రౌండింగ్ కాగా 4.46కోట్ల సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల అకౌంట్లలో మూలుగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధితో పాటు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డెయిరీ యూనిట్‌లను ఎస్సీ కార్పొరేషన్ మంజూరు చేసింది. 2020–21లో 978 డెయిరీ యూనిట్‌లు మంజూరు కాగా 600 యూనిట్లకు రూ 8.40కోట్ల సబ్సిడీ విడుదలయ్యాయి. ఒక్కో యూనిట్ విలువ రూ. 2లక్షలు. అందులో ప్రభుత్వం నుంచి రూ.1.40 లక్షలు (70శాతం) సబ్సిడీ, లబ్ధిదారుడి వాటా బ్యాంక్ నుంచి రుణం రూ.60 వేలు (30శాతం) అందించాలి. ఇప్పటి వరకు 281 యూనిట్లను పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్‌లో రెండు పాడి పశువులు అందించారు. ఇంకా 319 యూనిట్లు గ్రౌండింగ్ కాకపోవడంతో రూ.4.46 కోట్లు బ్యాంక్‌లోనే నిల్వ ఉన్నాయి.

బెజ్జంకిలోనే అధికం

ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గ్రౌండింగ్ కోసం లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో సబ్సిడీ డబ్బులను జమ చేసింది. గ్రౌండింగ్ చేయకుండా బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండేళ్లుగా లబ్ధిదారులు బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నా రుణాలు మంజూరు చేయడంలేదు. బెజ్జంకి మండలంలోని కేడీసీసీ బ్యాంక్‌లో దాదాపు 80 మంది లబ్ధిదారుల సబ్సిడీ డబ్బులు గతంలోనే జమ అయ్యాయి. ఇదే బెజ్జంకి కేడీసీసీ బ్యాంక్ వారు గతంలో రుణం డబ్బులు ఎఫ్‌డీ చేస్తేనే యూనిట్‌ను గ్రౌండింగ్ చేశారు.



లబ్ధిదారుడు బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన రశీదు

మాకొద్దు యూనిట్లు

బ్యాంకర్లు పెట్టే ఇబ్బందులు.. మరో పక్కన తీసుకవచ్చిన పాడి పశువులతో సరిగా పాల ఉత్పత్తి రాకపోవడంతో మాకు వద్దు యూనిట్లు అంటూ రద్దు కోసం ఎస్సీ కార్పొరేషన్‌లో లేఖలను అందిస్తున్నారు. హర్యానా నుంచి పాడి పశువులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీంతో అక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకవచ్చిన పాడి పశువులు ఇక్కడి వాతావరణానికి సరిగా అలవాటు పడటం లేదు. దీంతో పాలు తక్కువగా ఇస్తున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోకల్ అయిన, ఆంధ్రప్రదేశ్‌లోనైనా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించాలని, బ్యాంకర్లే రుణం ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వెళ్లొద్దు



ప్రభుత్వ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా బ్యాంకర్లు ముందుకు వెళ్లవద్దు. ఎస్సీ కార్పొరేషన్ డెయిరీ యూనిట్ల మంజూరుపై బ్యాంక్ మేనేజర్లతో టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తాను. బ్యాంకర్లు రుణాలు ఇవ్వని పక్షంలో వెంటనే సబ్సిడీ డబ్బులను ఎస్సీ కార్పొరేషన్‌కు రిటర్న్ చేయాలని ఆదేశిస్తాను.

- హరిబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్

యూరియా కోసం అవే తిప్పలు

రైతులకు ఇంకా యూరియా తిప్పలు తప్పడం లేదు. మంగళవారం దుబ్బాకకు యూరియా వస్తుందని తెలిసి తెల్లవారుజామునే వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎరువుల దుకాణాల వద్ద క్యూ కట్టారు. రెండు లారీల యూరియా రావడంతో ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. చాలా మందికి దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. - దుబ్బాక



దుబ్బాకలో యూరియా కోసం క్యూకట్టిన రైతులు

భారీ వర్షానికి కూలిన పెంకుటిల్లు

- ఇంట్లో చిక్కుకున్న వృద్ధ దంపతులు
- వెలుపలికి తీసిన పోలీసులు, స్థానికులు

దౌల్తాబాద్(దుబ్బాక): భారీ వర్షానికి పెంకుటిల్లు కూలడంతో అందులో వృద్ధ దంపతులు చిక్కుకుపోయారు. ఈ ఘటన దౌల్తాబాద్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కమ్మరి పెద్ద లక్ష్మయ్య, శారద వృద్ధ దంపతులు నివసిస్తున్న పెంకుటిల్లు తెల్లవారుజామున కూలింది. దీంతో వారు ఇంట్లోనే ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని వారిని వెలుపలికి తీశారు. అనంతరం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ సిద్ధం

- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి
- త్వరలో సీఎం రేవంత్‌తో ప్రారంభిస్తాం
- ఫ్యాక్టరీ పనుల పరిశీలన



ఫ్యాక్టరీలో ఆయిల్‌పామ్ గెంజల ర్యాంప్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ రాఘవరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): నర్మేటలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం ఫ్యాక్టరీని సందర్శించారు. ట్రయల్‌రన్‌లో భాగంగా ఆయిల్‌పామ్ గెంజల కొనుగోలు చేసే ర్యాంపు పనులను ప్రారంభించారు. యంత్రాల పని తీరును పరిశీలించి ఆయిల్‌ఫెడ్ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చేతుల మీదుగా ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

- పోలీసు కమిషనర్ అనురాధ
- సిద్దిపేట ఏసీపీ కార్యాలయం, టూటౌన్ పీఎస్ సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సీపీ అనురాధ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట ఏసీపీ కార్యాలయం, టూటౌన్ పీఎస్‌ను సీపీ మంగళవారం సందర్శించారు. పీఎస్ ఆవరణలో మొక్కను నాటారు. పీఎస్‌లో సీజ్ చేసిన వాహనాలను, పలు రికార్డులను పరిశీలించారు. జిల్లాలో నూతనంగా మహిళా పోలీసు సిబ్బంది నిర్వహించే బ్లూకోల్ట్స్ విధులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్, అక్రమ ఇసుక రవాణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వీపీఓలు తరచూ గ్రామాలను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐలు ఉపేందర్, వాసుదేవరావు, విద్యాసాగర్, శ్రీను, శ్రీధర్‌గౌడ్, కిరణ్, ఎస్ఐలు ఆసిఫ్, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో కమిషనర్ అయోధ్యరెడ్డి తదితరులు

పకడ్బందీగా స.హ. చట్టం

- సమాచారం అడిగేందుకు ఆర్టీఐ వజ్రాయుధం
- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి
- కలెక్టరేట్‌లో పీఐఓలకు అవగాహన



హాజరైన అధికారులు

సిద్దిపేటరూరల్: సమాచార హక్కు చట్టాన్ని అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సమాచార హక్కు చట్టంపై పీఐఓలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, పీవీ శ్రీనివాసరావు, మొహసిన పర్వీన్‌లు కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌లతో కలిసి పాల్గొన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టం ద్వారా తక్కువ దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, దీనికి కృషి చేసిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. రాష్ట్రంలో 17,000 దరఖాస్తులు పెండింగ్ ఉన్న సందర్భంగా వాటిని పరిష్కరించి జీరోగా మార్చేందుకే జిల్లాల్లో పర్యటిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏటా లక్షా 50 వేల మంది సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అడుగుతున్నారన్నారు. తెల్లరేషన్ కార్డ్ దారుడు ఉచితంగా సమాచారాన్ని పొందవచ్చన్నారు. ఇతరులు 10 రూపాయల కోర్ట్ ఫీ ద్వారా చెల్లించి సమాచారం పొందవచ్చన్నారు. పౌర సేవలు ఏ సమయంలో అందించాలి, అధికారుల వివరాలను తెలిపే సైన్ బోర్డ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కార్యాలయంలో పీఐఓ, ఏపీఐఓలు దరఖాస్తులు స్వీకరించి సమాచారం అందించాలని సూచించారు. చట్టంపై అధికారులందరికీ సమగ్రమైన అవగాహన కల్పించి పటిష్టంగా అమలు జరిగేలా ఆర్టీఐ కమిషన్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా చట్టంపై పీఐఓ,ఏపీఐఓలకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

అనంతరం సమాచార హక్కు చట్టం కమిషనర్ అయోధ్యరెడ్డి మాట్లాడుతూ ఆర్టీఐ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు వారధులుగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది పని చేయాలన్నారు. తప్పుడు సమాచారం అందించినా, ఆలస్యం చేసినా ఆర్టీఐ చట్టం ప్రకారం కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు అనవసరంగా భయాందోళనలకు గురై సమాచారాన్ని దాచి పెట్టాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు సమాచార హక్కు చట్టం చాలా దోహదం చేస్తుందన్నారు. జిల్లాలో ఆర్టీఐ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న 170 కేసులను కమిషన్ సభ్యులు శాఖల వారీగా పరిశీలించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు, ఏసీపీలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో అలసత్వం తగదు

- కలెక్టర్ హైమావతి
- జగదేవ్‌పూర్‌లో పర్యటన



జగదేవ్‌పూర్ పీహెచ్‌సీలో షుగర్ పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ హైమావతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వైద్య సేవల్లో అలసత్వం తగదని కలెక్టర్ హైమావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు అందుతున్నాయా?..అంటూ ఆస్పత్రికి వచ్చిన వృద్ధురాలితో కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. వైద్యులు సూచించిన విషయాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆస్పత్రి రికార్డులను తప్పనిసరిగా అమలు చేయాలని, రోగుల వివరాలను నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్‌కు వైద్యురాలు బీపీ, షుగర్ చూసి సాధారణంగా ఉందని తెలిపారు.

భూ భారతి సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తుల తీరు తెన్నులపై ఆరా తీశారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను భూ భారతి నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అలాగే దౌలాపూర్‌లో ఇందిరమ్మ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహశీల్దార్ నిర్మల, ఎంపిడిఓ రాంరెడ్డి, వైద్యుడు సత్యప్రకాష్, కార్యదర్శి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన పూజల



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు, సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల పూజల హరికృష్ణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిశానన్నారు. జిల్లా కాంగ్రెస్‌లో కొంత కాలంగా జరుగుతున్న పరిణామాలపై సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. పార్టీలో అంతర్గత విభేదాలపై పార్టీ చూసుకుంటుందని, పట్టించుకోవద్దని తాను అండగా నిలబడతానని ముఖ్యమంత్రి తెలిపారన్నారు.

తపాలా.. ఎందుకిలా?

- రైల్వే సేవల నుంచి తప్పుకున్న పోస్టల్ శాఖ
- పలుచోట్ల రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్ల మూసివేత
- గ్రామీణులకు ప్రయాణ రిజర్వేషన్లు ఇక దూరభారమే



హుస్నాబాద్‌లోని సబ్ పోస్టాఫీస్

హుస్నాబాద్: పలు ప్రాంతాల్లోని పోస్టాఫీసుల్లో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్లను ఎత్తేశారు. దీంతో గ్రామీణులకు తిప్పలు తప్పడంలేదు. ప్రముఖ పుణ్య క్షేత్రాలు, టూరిజం స్పాట్లకు వెళ్లాలంటే రైలు ప్రయాణమే శ్రేయస్కరం. రైలు సౌకర్యం లేని సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్లు పని చేస్తున్నాయి. భారత రైల్వేలు, పోస్టల్ శాఖ సమన్వయంతో ఇండియా పోస్ట్ ప్యాసింజర్ రైల్వే సిస్టమ్ (ఐపీపీఆర్ఎస్) ప్రవేశపెట్టారు. రైల్వే శాఖ, పోస్టల్ శాఖ సమన్వయంతో హుస్నాబాద్ సబ్ పోస్టాఫీస్‌లో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ ద్వారా రైతులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు వివిధ ప్రాంతాలు, దేవస్థానాలకు వెళ్లేందుకు టికెట్ బుకింగ్ చేసుకొనే ప్రయోజనం ఉంది. అయితే దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పోస్టాఫీసులకు గాను 134 సెంటర్లల్లో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్లను ఎత్తివేశారు. ఇందులో తెలంగాణలో హన్మకొండ, భూపాల్‌పల్లి, హుస్నాబాద్, వనపర్తి, సూర్యాపేట, సిద్దిపేట, సంగారెడ్డి సబ్ పోస్టాఫీస్‌లు ఉన్నాయి.

గ్రామీణ ప్రాంత వాసులకు తిప్పలు

హుస్నాబాద్ సబ్ పోస్టాఫీస్‌లోని టికెట్ కౌంటర్ నుంచి రోజు విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, ఢిల్లీ, ముంబయి నగరాలకు రైల్వే రిజర్వేషన్లకు టికెట్లను బుక్ చేసుకుంటారు. కరీంనగర్, వరంగల్ ప్రాంతాల ప్రజలు కూడా ఇక్కడికే వచ్చి రైల్వే రిజర్వేషన్ చేసుకుంటారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలు, నగరాలకు వెళ్లకుండా స్థానిక పోస్టాఫీస్‌లోని రిజర్వేషన్ల బుకింగ్ కౌంటర్ ద్వారా టికెట్లు తీసుకుంటున్నారు. ఇక్కడ ఉన్న కౌంటర్‌ను మూసివేయడంతో పట్టణాల్లో కానీ, ఆన్‌లైన్‌లో రైల్వే రిజరేషన్లు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టార్గెట్ పూర్తికాకపోవడంతో..

పోస్టాఫీస్‌లో ఏర్పాటు చేసిన ఐపీపీఆర్ఎస్ సెంటర్ ద్వారా రోజు 10 టికెట్లు తగ్గకుండా ఎక్కువగా రిజర్వేషన్లు బుక్ చేసుకోవాలని టార్గెట్ విధించారు. కానీ 5 నుంచి 6 మాత్రమే ఎప్పుడో ఒక్కసారి 10 లోపు టికెట్లు బుక్ చేసుకునే పరిస్థితి. దీంతో టార్గెట్ పూర్తికావడం లేదని పోస్టల్ శాఖ భావించింది. అలాగే సిబ్బంది కొరత, ఇతరత్రా సమస్యలతో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్ భారమని పోస్టల్ శాఖ కౌంటర్లను ఎత్తివేసినట్లు తెలుస్తోంది. రైల్వే బుకింగ్ వల్ల పోస్టాఫీస్‌కు సంబంధించిన పథకాలు, లావాదేవీలకు ఆటంకం కలుగుతుందని సమాచారం. అందుకే రైల్వే సేవల నుంచి పోస్టల్ శాఖ తప్పుకుంది. హుస్నాబాద్ పోస్టాఫీస్‌లో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాసిన విషయం విదితమే.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు

ముగ్గురికి గోల్డ్ మెడల్స్



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించినట్లు రెంజుకి షోటోకాన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టర్ నగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో ముంబైలోని బీవండిలో జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయి. బ్రేవైస్ యూత్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మెదక్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు బ్లాక్ బెల్టు విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. అండర్ 13లో స్వరూప్ సింగ్, అండర్ 16లో అబ్దుల్లా , అండర్ 17లో సూరజ్.. గోల్డ్ మెడల్స్‌తోపాటు చాంపియన్‌షిప్ కూడా గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ రాజారామ్, కేశవ్ మాస్టర్స్ , విద్యార్థులను అభినందిచారు.

శతాధిక వృద్ధురాలు మృతి



సందిగారి లింగమ్మ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో శతాధిక వృద్ధురాలు సందిగారి లింగమ్మ(108) మంగళవారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త భూమగౌడ్ 50 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, పెద్ద కుమారుడు పదేళ్ల క్రితం మృతి చెందగా, చిన్న కుమారుడు నారాగౌడ్ తల్లి అంత్యక్రియలు నిర్వహించారు. మనవలు, మునిమనవలను చూసిన ఆమె వృద్ధాప్యంతో మృతి చెందారు.

బెల్లం, పట్టిక పట్టివేత

హుస్నాబాద్: హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్లే దారిలో సోమవారం రాత్రి కారులో తరలిస్తున్న బెల్లంను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ పవన్ వివరాల ప్రకారం ... టాటా ఇండికా కారులో తరలిస్తున్న 180 కిలోల బెల్లం, 20 కిలోల పట్టిక, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దిడిగం మనోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు గతంలో గుడుంబా తయారీదారులకు బెల్లం, పట్టిక సరఫరా చేసిన కేసులో పట్టుబడి బైండోవర్ కూడా ఉల్లంఘించినట్లు తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న ఎస్సై దామోదర్, కానిస్టేబుళ్లు ఆరీఫ్, రాజు, సతీశ్, రజితను అభినందించారు.

గాంధీనగర్‌లో డెంగీ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ మహిళ డెంగీ బారిన పడటంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్. మైమూన, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో జ్వరపీడుతుల సర్వే చేపట్టారు. డెంగీ బాధితురాలి ఇంటి చుట్టూ దోమల మందు స్ప్రే చేయించారు. గ్రామాల్లో ఇంటింటికి ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించాలని డాక్టర్ మైమూన సూచించారు.

పిడుగుపాటుకు గేదె మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): పిడుగుపాటుకు గుర్రై పాడి గేదే మృత్యువాత పడింది. మండల పరిధిలోని డప్పూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండె రవి రోజు మాదిరిగా ఉదయం తన గేదెను మేత మేపేందుకు పొలానికి తీసుకువెళ్లాడు. 11.30 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో వర్షం మొదలై ఒక్కసారిగా గేదెపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

గల్లంతైన బాలుడి మృతి

జహీరాబాద్ టౌన్: ఈతకు వెళ్లిన బాలుడు నీటి కుంటలో గల్లంతై మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... కోహీర్ మండలం పిచరాగడి గ్రామానికి చెందిన రిజ్వాన్(17) స్నేహితులు సలీం, గుల్లుతో కలిసి హుగ్గెల్లి గ్రామ శివారులో గల నీటి కుంటలో ఈత కొట్టేందుకు వచ్చి నీట మునిగిన విషయం తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సోమవారం కుంటలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఉదయం గాలింపు చేపట్టగా బాలుడి మృతదేహం లభ్యమైంది.

చెరగని జ్ఞాపకాలు.. నాటి పోరాటాలు




దోపిడీ, వెట్టి చాకిరీ, పెత్తందారి వ్యవస్థ, అరాచకాలకు పాల్పడుతున్న నిజాం రజాకార్లకు ఎదురొడ్డి పోరాటం చేశారు. వారిని నిలువరిస్తూ దళాలు కట్టి పలు ప్రాంతాలకు చెందిన ఎంతో మంది సాయుధ తెలంగాణ పోరాటంలో అసువులు బాశారు. అప్పట్లో జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలు, కాల్పులు, చెరిగిపోని గుర్తులపై కథనాలు.

అప్పటి ఘటనలు ఇంకా ప్రజల మదిలో..

- అసువులు బాసిన ఎంతో మంది వీరులు
- సెప్టెంబర్ 17 సందర్భంగా ప్రత్యేక కథనాలు

ఏడాదికి ఒకసారి యాదికొస్తాం

సాయుధ పోరాట యోధుడు చల్లా చంద్రారెడ్డి ఆవేదన



సమర యోధుడు చల్లా చంద్రారెడ్డి




బైరాన్‌పల్లి బురుజు

మద్దూరు(హుస్నాబాద్): భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం పాలనలో బిక్కుబిక్కు మంటూనే గడిపింది. భారత్‌లో విలీనం చేయాలన్న ప్రజల ఆకాంక్షలు, ప్రతిఘటనలు, పోరాటాల రూపంలో తెరపైకి రావడం మొదలైంది. వీటన్నింటికి పరాకాష్టగా బైరాన్‌పల్లి నరమేధం కలకలం రేపింది. సెప్టెంబర్ 17 నాటికి హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. తెలంగాణ పోరాట యోధుడు చల్లా చంద్రారెడ్డిని సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ చేయగా ఆయన పలు విషయాలను వెల్లడించారు. నాడు రజాకార్లు రైతులను, మహిళలను అవమాన పరుస్తూ అనేక హత్యలు, అత్యాచారాలు చేశారని, దీన్ని ఎదుర్కొని బైరాన్‌పల్లి గ్రామంలో బురుజు పైనుండి రజాకార్ల సైన్యాన్ని తిప్పి కొట్టామని తెలిపారు. అందులో తోటి మిత్రులు, వృద్ధులు అనేక మంది వీరమరణం పొందారని చెప్పారు. ఆ పోరాటంలో పాల్గొన్న చివరి వ్యక్తిని తానే అన్నారు. నాయకులకు ఏడాదికి ఒకసారి మాత్రమే గుర్తుకొస్తామన్నారు. బైరాన్‌పల్లి ఘటనను పాఠ్యాంశాల్లో ఎక్కించి , అమరవీరుల పేర్లను బురుజుపై రాయించాలన్నారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.



మెదక్ బాలభారతి మండలి సభ్యులు 1948లో ఖిల్లాపై ఎగురవేసిన జాతీయజెండా

నిజాంను నిలువరించిన ధీరులు



చోళ లింగయ్య

మెదక్‌జోన్: రజాకార్ల అరాచకాలకు బలైన ప్రాంతాల్లో మెదక్ కూడా ఒకటి. మెదక్ పట్టణం అరబ్‌గల్లీకి చెందిన అన్నదమ్ములైన బట్టి కిష్టయ్య, బట్టి వెంకయ్యలతో పాటు కేవల్ కిషన్, బళ్లాల బాబయ్య, సిల్వర్ రాజయ్య, గంగారం ఈశ్వరయ్య, గులాం దస్తగిరితో పాటు మొత్తం 80 మంది సభ్యులు బాలభారతీ మండలి పేరుతో సంఘం పెట్టారు. ఎక్కడికక్కడ రజాకార్లు చేసే అకృత్యాలను అడ్డుకోవటం, దాడులకు ప్రతి దాడులు చేస్తూ నిలువరించినట్లు నేటికీ ఇక్కడి ప్రజలు చెప్పుకుంటారు.

ఉద్యోగాన్ని వదిలి పోరాటంలో చేరి..

మెదక్ పట్టణానికి చెందిన చోళ లింగయ్య స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆర్మీ ఎయిర్స్ ఫోర్స్ విభాగంలో గ్రౌండ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆజాద్ హింద్ ఫౌజ్ 'స్థాపనకు సుభాష్ చంద్రబోస్ పిలుపునందుకుని ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమంలో చేరాడు. సుభాష్‌చంద్రబోస్ విమాన ప్రమాదంలో మరణించాక చోళ లింగయ్య తిరిగి మెదక్‌కు వచ్చారు. ఈ ప్రాంతంలో రజాకార్లకు వ్యతిరేకంగా ఏర్పాటైన బాలభారతీ మండలి సభ్యులతో జత కట్టాడు. రజాకారుల దాడులను తిప్పికొట్టేందుకు ప్రత్యేకంగా దళాల ఏర్పాటు, తుపాకులు, బాంబులు తయారు చేశాడు. 1947 ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని మెదక్‌లోని పటేల్ కుంటలో మండలి సభ్యులతో కలిసి ఎగరవేశారు. దీంతో పోలీసులు లింగయ్యతో పాటు కొందరిని ఔరంగాబాద్ జైలులో 7 మాసాల పాటు నిర్బంధించారు. అనంతరం సర్దార్ పటేల్ మిలిటరీ యాక్షన్‌తో తెలంగాణకు విముక్తి లభించగా జైలు నుండి బయటకు వచ్చారు. కాగా చోళ లింగయ్య 2010లో చనిపోయారు.

ఎదురొడ్డి నిలబడిన మహ్మదాపూర్




మహ్మదాపూర్‌లో వీరుల జ్ఞాపకార్థం నిర్మించిన స్తూపం



12 మంది వీరుల మరణానికి గుర్తుగా నిర్మించిన శిలాఫలకం

హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ ప్రాంతంలో కొనసాగిన దొరలు, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా కరీంనగర్ జిల్లా పొలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు ఈ ప్రాంత ప్రజలను చైతన్యం చేస్తూ వెట్టి చాకిరికి విముక్తి కల్పించారు. 1948 మార్చి 14న అటవీ సమీపంలోని మహ్మదాపూర్‌కు అనభేరి ప్రభాకర్‌రావు , సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలతో ఊరికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న రజాకారులు వారు భోజనం చేసే సమయంలో దాడికి దిగారు. ఈ కాల్పుల్లో 12 మంది వీరమరణం పొందారు. ఈ ఘటన జరిగిన ఆరు నెలలకు నిజాం నవాబు లొంగిపోయాడు. సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన వీరుల జ్ఞాపకార్థం గుట్ట కింద అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతి సమాధులు నిర్మించి ప్రతి ఏటా సెప్టెంబర్ 17న, మార్చి 14 న కమ్యూనిస్టులు నిర్వహించే సభలకు ప్రజలు పార్టీలకు అతీతంగా హాజరై వీరులకు నివాళులర్పిస్తారు.

రజాకార్ల తూటాలకు..



రాయికోడ్: కాల్పులు జరిగిన గౌని ప్రాంతం

రాయికోడ్(అందోల్): తెలంగాణ సాయుధ పోరాటంలో రాయికోడ్ వాసులు పాల్గొన్నారు. ఈ పోరాటానికి సంఘీభావంగా కొనసాగిన ఆర్యసమాజ్ ర్యాలీని గ్రామానికి ఆహ్వానించారు. నిజాం సర్కారు ర్యాలీకి అనుమతివ్వలేదు. ర్యాలీ గ్రామంలోని గౌని ప్రాంతానికి చేరుకోగానే ఉద్యమకారులు, రజాకార్లకు మధ్య ఘర్షణలు జరిగాయి. రజాకార్లు ర్యాలీలోని ఉద్యమకార్లపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 14 మంది గ్రామస్తులు అమరులయ్యారు. ర్యాలీలో పాల్గొన్నందుకు 8 మందికి నిజాం ప్రభుత్వం జైలు శిక్ష విధించింది. అనంతరం రజాకార్లు రెచ్చిపోయి గ్రామంలోని ఇళ్లలో ఉన్న ధనం, ధాన్యాన్ని లూటీ చేశారు. ఉద్యమ కుటుంబాల ఇళ్లకు నిప్పంటించగా ఇళ్లు, సామగ్రి, పంట ఉత్పత్తులు కాలిబూడిదయ్యాయి. అప్పటి ఉద్యమకారులు, సమిధలైన వారి జ్ఞాపకాలు ఇంకా గ్రామస్తుల మదిలో మెదులుతూనే ఉన్నాయి.

చుంచనకోట గుట్టల్లో నక్క

సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తింపు



సీసీ ఫుటేజీలో నమోదైన నక్క చిత్రం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట గుట్టల్లో నక్క సంచరిస్తుందని పారెస్టు అధికారి రాముడు తెలిపాడు. మంగళవారం గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా పుటేజీ పరిశీలించిన ఆయన గుట్టల్లో నక్క సంచరిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పెద్దగుట్ట ప్రాంతంలో ఓ రైతుకు చెందిన దూడను చంపిన ఘటనపై జంతువును గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో పెద్ద నక్క సంచరిస్తున్నట్లు రికార్డు అయినట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గౌరవెల్లిలో సంచరిస్తున్నట్లు అనుమానం!

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామ శివారులోని గుట్టల్లో నక్క సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు అనిత, సాజిద్ పాషా అనుమానిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అటవీ శాఖ అధికారుల బృందం గౌరవెల్లి గ్రామ శివారులోని గుట్టల్లో పర్యటించి, జంతువుల ముద్రలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రాప్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో నక్క జాతికి చెందిన అడోరకం నక్క లాంటి జంతువు ఉన్నట్లు ఫొటో కనిపించిందన్నారు. ఏదైనా అడవి జంతువులు సంచరిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

కదిలే రైలు కిందపడిన ప్రయాణికుడు..

- మణికట్టు వరకు తెగిపడిన చేతులు
- ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన అనిల్

జహీరాబాద్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో నీళ్లు పట్టుకునేందుకు దిగిన ప్రయాణికుడు అనిల్ కదులుతున్న రైలెక్కే ప్రయత్నంలో రైలు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే శాఖ కథనం ప్రకారం... మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న రైలు ఉదయం 11.30 గంటల ప్రాంతంలో జహీరాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ క్రమంలో నీటిని పట్టుకునేందుకు ప్లాట్‌ఫాం నల్లా వద్దకు వెళ్లాడు. నీరు పట్టుకుంటుండగా రైలు కదిలింది. అప్రమత్తమై రైలెక్కే క్రమంలో అదుపు తప్పి రైలు కింద పడిపోయాడు. ఈ ఘటనను గమనించిన ప్రయాణికులు పెద్దగా కేకలు వేయడంతో రైలు వెనుకాల ఉన్న గార్డు డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో రైలును నిలిపివేశాడు. వెంటనే అతడిని రైలు కింద నుంచి బయటకు తీసి జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీకి తరలించారు. ప్రమాదంలో ప్రయాణికుడి రెండు చేతులు మణికట్టు వరకు తెగిపోయాయి. గాయపడిన అనిల్ ఔరంగాబాద్ జిల్లాలోని సిలార్ గ్రామానికి చెందిన వాడు. ఇతడు తిరుపతికి వెళుతున్నట్లు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు ఉరివేసుకున్న అనిల్

తూప్రాన్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని రావెల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొల్లబోయిన అనిల్(30) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. దీంతో మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతునికి భార్య లత ఉంది.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


మెదక్ కలెక్టరేట్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని హైదరాబాద్ సెక్రెటేరియెట్‌లో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు 2008 డీఎస్సీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా ఇటీవల రాష్ట్ర హైకోర్టు 3 నెలల్లో అమలు చేయాలని తీర్పు ఇచ్చిందని చెప్పారు. హర్షవర్ధన్ రెడ్డి, వినోద్ కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వికలాంగురాలి ఇంట్లో చోరీ

రూ.90వేలు అపహరణ

వట్‌పల్లి(అందోల్): ఒంటరిగా నివాసం ఉంటున్న వికలాంగురాలి ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి వివరాలు ఇలా... అందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన వికలాంగురాలు సింగి లక్ష్మమ్మ ఇటీవల బ్యాంకులో దాచుకున్న డబ్బులలో రూ.90 వేలు డ్రా చేసుకొని తీసుకువచ్చి ఇంట్లో దాచుకుంది. ఈ నెల 14న ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని బంధువుల వద్ద విందు కార్యానికి వెళ్లింది. భారీ వర్షం కురవడంతో రాత్రి అక్కడే ఉండి, 15న మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా నగదు కనిపించలేదు. దీంతో జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వృద్ధుడు అదృశ్యం



వడ్డె హన్మయ్య

నారాయణఖేడ్: ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని తుర్కాపల్లికి చెందిన వడ్డె హన్మయ్య (65) గతనెల 15న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడికి మతిస్థిమితం సక్రమంగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

సంగారెడ్డి క్రైమ్: మానురు మండలం డోవూరు గ్రామానికి చెందిన కుర్నం నర్సింలు(53), ఈ నెల 13న మధ్యాహ్నం అల్లుడి ఇంటికని వచ్చి బస్టాండ్‌లో తప్పిపోయాడు. బస్సు దిగ్గిన వెంటనే అల్లుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో అల్లుడు అక్కడికి వచ్చి చూడగా నర్సింలు కనిపించలేదు. సోమవారం ఉదయం బస్టాండ్ ఆవరణలో వృద్ధుడిని గమనించిన పోలీసులు స్టేషన్‌కు తరలించి, వివరాలు తెలుసుకొని నర్సింలును అల్లుడు శ్రీకాంత్‌కు అప్పగించారు.

నాచారంలో యువతి..



శైలజ

వర్గల్(గజ్వేల్): యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని నాచారంలో జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణ కూతురు శైలజ(21) సోమవారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి అందరూ పడుకున్నారు. అదేరోజు రాత్రి 10.30 గంటలకు తండ్రి లేచి చూస్తే కూతురు కన్పించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చరిత్రను వక్రీకరిస్తే క్షమించరు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మద్దూరు(హుస్నాబాద్): బైరాన్‌పల్లి పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ నాయకులు ఈ పోరాటానికి మేము వారసులం అని చెప్పుకోవడం సిగ్గుచేటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. బైరాన్‌పల్లి చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు పేర్కొన్నారు. మంగళవారం దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అమరవీరుల సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల స్తూపం, బురుజు వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటం కుల, మతాలకు అతీతంగా సాగిన గొప్ప పోరాటం అని అన్నారు. రజాకార్లు బైరాన్‌పల్లి, కూటిగల్ గ్రామాలపై ఒకే రోజు దాడి చేసి 108 మంది చంపినా, మిగిలిన వారు భయపడకుండా ఎర్ర జెండా పట్టుకుని పోరాటం చేశారని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ పోరాటాన్ని వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని దొంగ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. బైరాన్‌పల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి అర్హులైన పోరాటయోధులకు పింఛన్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్క రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్, యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్‌మావో, యాదగిరి , అరుణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ సిబ్బందిని రైతులు అడ్డుకుని ఈ ఘటన మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ శివారులో భూమి కొనుగోలు చేసిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి బయాన చెరువు పక్క నుండి నక్షబాట ఉందని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో మంగళవారం తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ కిషన్, సర్వేయర్ అరుణ్‌కుమార్ సర్వే చేసేందుకు వెళ్లగా రైతులు ఆందోళన చేపట్టారు. గతంలో ఉపాధిహామీ ద్వారా వేసిన రోడ్డు ఉందని, కావాలనే తమ పొలాల నుండి బాట తీసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు పాపయ్యచారి, నర్సింలు, సలీం, అశోక్, గంగారం, అన్వర్, పాషామియ్య వాపోయారు. వీరికి మద్దతుగా బీజేపీ నాయకులు పాల్గొన్నారు. రెవెన్యూ రికార్డు పరంగా నక్షబాట ఉందని, దరఖాస్తు చేసుకున్నందునే అక్కడికి వెళ్లామని తహసీల్దార్ తెలిపారు. రైతులు అడ్డుకోవడంతో 10 రోజుల సమయం ఇచ్చామని చెప్పారు.

పురుగుల మందు తాగి యువకుడు..



ఆనంద్

హవేళిఘణాపూర్(మెదక్): పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని శమ్నాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా... గ్రామానికి చెందిన పట్నం స్వరూప, శంకరయ్య రెండవ కుమారుడు అనంద్(26) హైదరాబాద్‌లోని మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత ఆదివారం ఇంటికి తిరిగి వచ్చిన ఆనంద్ శమ్నాపూర్ గేటు వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గ్రామస్తులు కుటుంబీకులకు సమాచారం అందించగా మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు ప్రేమ విఫలమై పురుగుల మందు తాగాడని కుటుంబీకులు అనుమానిస్తున్నారు.

రైలు కింద పడి వృద్ధుడు..

జహీరాబాద్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలు కింద పడి వృద్ధుడు మరణించాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... మంగళవారం మధ్యాహ్నం 11.30 గంటల ప్రాంతంలో ఔరంగాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న రైలు కింద పడి టి.నర్సింహులు(65) అక్కడికక్కడే మరణించాడు. ఝరాసంగం మండలం ప్యాలవరం గ్రామానికి చెందిన నర్సింహులు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. కాలనీ పక్కనే ఉన్న రైల్వే స్టేషన్‌లోకి నీళ్లు తాగేందుకు వెళుతున్న క్రమంలో రైలు కిందపడి ఉండవచ్చని, లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..



కుమ్మరి కృష్ణ

హత్నూర(సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చీకమద్దూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ(45) గ్రామ శివారులోని దుబ్బ చెరువు నీటిలో కుమ్మరి కృష్ణ పడిపోగా గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మచ్చుకూరి సత్యనారాయణ, నీరుడి ఏసు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అతడు మృతి చెందాడు. కాగా అతని మృతిపై అనుమానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడు కృష్ణకు ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు.